క్లుప్తంగా

ఆర్థిక సాయం



మృతుని భార్య జయమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మడకశిరరూరల్: అమరాపురం ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ గుర్రపుకొండ రంగనాథ్ గుండెపోటుతో ఇటీవల మృతిచెందాడు. దీంతో గురువారం మడకశిర డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రూ.60 వేల ఆర్థిక సాయం బాధితురాలు జయమ్మకు అందించారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, ఐదు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

పరిగి: మండలంలో శుక్రవారం నుంచి రీ సర్వే ప్రక్రియపై గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దారు హసీనా సుల్తానా గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18న బందార్లపల్లి, 19న విట్టాపల్లి, 21న సంగమేశ్వరంపల్లి, 22న ఎర్రగుంట, 23న కొడిగెనహళ్లి, 24న శాసనకోట, 25న గణపతిపల్లిలో గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు.

రొద్దం: గతంలో భూ రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నాగేంద్ర గురువారం తెలిపారు. 18న రెడ్డిపల్లి, 19న బూచెర్ల, 21న నల్లూరులో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

అత్యాచార బాధితులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించండి



ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్: సాముహిక అత్యాచారానికి గురైన వలస కార్మిక కుటంబాలకు జీవన భృతితో పాటు, ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుకలు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ గతవారం చిలమత్తురు మండలంలోని నల్లబోయినపల్లిలో జరిగిన అత్యాచార ఘటన రాష్ట్ర వ్యాప్తంగా దుమారం లేపిదన్నారు. అధికార పార్టీ నాయకులు కేవలం పరామర్శలకు పరిమితమయ్యారన్నారు. బాధితులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

హోమ్‌లెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: అర్బన్ హోమ్‌లెస్ సెంటర్‌ను పర్యాటకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత సూచించారు. పెనుకొండ పట్టణంలోని మడకశిర రోడ్డులో సమతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం అర్బన్ హోమ్‌లెస్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, ఆయా మండలాల ప్రజలు పనుల నిమిత్తం వచ్చి రాత్రి వేళ గమ్యస్థానాలకు వెళ్లలేని పరిస్థితిలో హోమ్‌లెస్ సెంటర్‌లో ఉండవచ్చన్నారు. వారికి భోజన సౌకర్యంతో పాటు బెడ్ సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశులు, కమిషనర్ శ్రీనివాసులు, సంస్థ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ భక్తర్ ఉరుసు



గంధోత్సవంలో పాల్గొన్న భక్తులు

లేపాక్షి: నాగేపల్లి వద్ద వెలిసిన హజరత్ పీర్ భక్తర్ వలి దర్గాలో బుధవారం రాత్రి ఉరుసు ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ముక్తియార్, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి గంధోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా పెనుకొండ బాబయ్య స్వామి వంశస్తులు అబ్దుల్ రెహమాన్ సమక్షంలో గంధాన్ని స్వామి వారికి సమర్పించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు వెంకటరమణప్ప, సమీవుల్లా, ఆదిరామిరెడ్డి, సందీప్, నరసింహారెడ్డి, క్రిష్టప్ప, బాబాజాన్, అహులేసున్నతుల్, జమాత్ అధ్యక్షుడు మహబూబ్‌దౌలత్ పాల్గొన్నారు.

నేటి నుంచి స్కౌట్ విద్యార్థుల టెస్టింగ్ క్యాంపు

లేపాక్షి: పులమతి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం నుంచి ఈనెల 22 వరకు రాష్ట్రస్థాయి తృతీయ సోపాన్, రాజ్యపురస్కార్ టెస్టింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుసుబ్బారావు గురువారం తెలిపారు.

రైల్వే రోడ్డు విస్తరణ ముమ్మరం

- రూ.1.50 కోట్లతో పనులు
- గతేడాది 70 శాతం భవనాల తొలగింపు
- తాజాగా నిర్మాణాల తొలగింపు పనులు ప్రారంభం



రైల్వేరోడ్డులో దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వేరోడ్డు విస్తరణ పనులను అధికారులు ముమ్మరం చేశారు. అయితే రోడ్డుపక్కనున్న నిర్మాణాల తొలగింపులో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని భవనాల యజమానులు వాపోతున్నారు. సుమారు 38 ఏళ్ల కాలం నుంచి పాలన సాగించిన టీడీపీ నేతలు రైల్వే రోడ్డు విస్తరణను ఎన్నికల హామీగా మార్చారే తప్ప ఏనాడు అమలుపై ముందుకు సాగలేదు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైల్వేరోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వం నుంచి రూ.1.5 కోట్లు, పెద్ద కాలువ నిర్మాణాన్ని మరో రూ.కోటి వ్యయంతో ప్రారంభించారు. వివిధ పథకాల ద్వారా మరిన్ని నిధులను సమకూర్చుకుని రోడ్డు మధ్యలో డివైడర్లు, సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రోడ్డు విస్తరణలో దాదాపు 168 నిర్మాణాలు తొలగించాల్సి వస్తుందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు భవనాల యజమానులకు నష్టపరిహారం కూడా చెల్లించారు. విస్తరణ పనులకు అంగీకారం తెలుపుతూ 99 మంది భవనాల యజమానులు అంగీకార ప్రతాలు కూడా అందజేశారు. ఇందులో కొందరు స్వచ్ఛందంగా నిర్మాణాలు కూడా తొలగించుకున్నారు.

రైల్వేరోడ్డు విస్తరణ వివరాలు..

రహదారి పొడవు :	1 కి.మీ
వెడల్పు :	80 అడుగులు
అంచనా వ్యయం :	సుమారు రూ.2.50 కోట్లు

ఇష్టారాజ్యంగా భవనాల తొలగింపు..

మున్సిపల్ అధికారులు రెండు రోజుల నుంచి విస్తరణ పనుల్లో భాగంగా నిర్మాణాల తొలగింపు చేపట్టారు. అయితే భవనా తొలగింపులో సరైన పద్ధతులు, యంత్రాలు వినియోగించకుండా ఇష్టానుసరంగా భవనాలు కూల్చివేస్తుడంతో భవన యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ కోసం భవనాల్లో కొంతభాగం పోయినా ఫర్వాలేదని అంగీకరిస్తే ఇప్పుడు ఏకంగా మొత్తం భవనాలు కూలిపోయేలా పనులు చేపడుతున్నారని వాపోతున్నారు. జేసీబీలతో కట్టడాల తొలగింపు చేపట్టడంతో భవనాలు మొత్తం ధ్వంసమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులను తాము సహకరిస్తున్నా ఇలా చేయడం సరికాదని చెబుతున్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

హిందూపురం పట్టణ ప్రజలు కోరిక మేరకు రైల్వే రోడ్డు విస్తరణకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే రోడ్డు ఇరువైపులా ఉన్న చాలా మంది వ్యాపారులు, భవనాల యాజమానులు నిర్మాణాల తొలగింపునకు అంగీకార పత్రాలు ఇచ్చారు. ఈ మేరకు భవనాల తొలగింపు పనులు చేపడుతున్నాం. భవన యజమానులు కోరిక ప్రకారం మిగిలిన భవనాలకు ఇబ్బంది లేకుండా తొలగింపు చేపడతాం. పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలి. – సునీల్, ఏసీపీ

మేమే తొలగించుకుంటామన్నా వినలేదు



రోడ్డు వెడల్పు కోసం నిర్ణయించిన మార్కింగ్ మేరకు తామే తొలగించకుంటామని చెబుతున్నా మున్సిపల్ అధికారులు వినడం లేదు. ఇష్టానుసారంగా కూల్చివేస్తే భవనాలు మొత్తం దెబ్బతింటాయి. తాము ముందే కోర్టు నుంచి స్టే కూడా తెచ్చుకున్నాం. అయినా భవనాన్ని తీసేయడానికి ఒప్పుకుని మార్కింగ్ మేరకు తొలగించుకుంటామంటే ఎవరూ వినడం లేదు. ఒక్కొక్కరికి ఒక్కో విధంగా చూడటం బాగాలేదు. –జావిద్, హిందూపురం

వర్షానికి కూలిన మిద్దె



గాద్రాళ్లపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు

చిలమత్తూరు: తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాద్రాళ్లపల్లిలో బావిరెడ్డి కి చెందిన మిద్దె కూలిపోయింది. బుధవారం రాత్రి బావిరెడ్డి నిద్రిస్తున్న సమయంలో రెండు రూముల్లో ఒకటి కూలిపోయింది. ఆ సమయంలో ఆ వ్యక్తి మరొక గదిలో పడుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రూ.లక్ష ఆస్తి వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. కూలిన మిద్దెను డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్ పరిశీలించారు.

'నిందితుడి కోసం గాలిస్తున్నాం'

హిందూపురం అర్బన్: చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో అత్తా కోడళ్ల అత్యాచారం చేసిన కేసులో నిందితుడి కోసం గాలింపు కొనసాగుతున్నట్లు డీఎస్పీ మహేష్ గురువారం తెలిపారు. ఘటనలో ఇప్పటికే పోలీసులు ఐదుగురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

సోమందేపల్లి: ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ తెలిపారు. గురువారం మండలంలోని జూలకుంట గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.12 లక్షలతో సి.సి. రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శైలజ, మాజీ సర్పంచ్ నారాయణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పల్లె పండుగ

రొళ్ల: మండలంలోని ఎం.రాయాపురం, హులికుంట పంచాయతీల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వీ.ఎం.పాండురంగప్ప, కన్వీనర్ దాసిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ దుకాణాలకు బహిరంగ వేలం

పావగడ: స్థానిక మున్సిపల్ శాఖకు సంబంధించిన వాణిజ్య దుకాణాలకు అంచెలంచెలుగా బహిరంగ వేలం వేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మున్సిపల్ బస్టాండులోని 34 దుకాణాలకు బహిరంగ వేలం వేసిన సంగతి విషయం విదితమే. రెండో విడతగా పాత కాయకూరల సంతలోని దుకాణాలు, పాత బస్టాండ్‌లోని తుమకూరు రోడ్డుకు చెందిన కింది అంతస్తు ముందర, వెనుక భాగంలోని దుకాణాలను ఈ నెల 29 న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ అధ్యక్షుడు రాజేశ్, ముఖ్యాధికారి జాఫర్ షరీఫ్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం జరగనుంది. 25న సాయంత్రం 5 గంటల లోపు వేలంలో పాల్గొనే వ్యక్తులు డిపాజిట్‌ను చెల్లించాలన్నారు. 28న సాయంత్రం 5 గంటల లోపు మున్సిపల్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

21న మండల సర్వసభ్య సమావేశం

గోరంట్ల: ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన ఈ నెల 21న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రకుమార్ గురువారం పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మూడుగంటలకు సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్ తెలిపారు. గురువారం చందకచెర్లు, ఈ అచ్చంపల్లి గ్రామాల్లో అంటువ్యాధులు, డయేరియా, డెంగీ తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ అసిసెంట్లు జుబేదాబేగం, చెన్నకేశవరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే వాల్మీకుల అభ్యున్నతి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు

మడకశిర: రాష్ట్రంలోని వాల్మీకులకు వైఎస్ జగన్ హయాంలోనే అన్ని విధాలుగా న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని వాల్మీకి విగ్రహానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గంలో వాల్మీకులకు అవకాశం కల్పించలేదని తెలిపారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐదేళ్లపాటు తన మంత్రి వర్గంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన గుమ్మనూరు జయరామ్‌కు మంత్రిగా అవకాశం కల్పించారన్నారు.చంద్రబాబు మంత్రి వర్గంలో వాల్మీకులకు చోటు కల్పించలేదన్నారు. జగన్ హయాంలో వాల్మీకుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేశారని తెలిపారు. మడకశిరకు చెందిన వాల్మీకి సంఘం నాయకుడికి డైరెక్టర్ పదవి కూడా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తనయుడు జయరాజ్, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ డైరెక్టర్ నాగరాజగౌడ్, కౌన్సిలర్లు నాగేంద్ర,అన్సర్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం నాయకుడు సత్యనారాయణ, వాల్మీకి సంఘం నాయకులు మధు, నాగరాజు, సతీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



పెనుకొండలో వాల్మీకి జయంతి వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు



హిందూపురంలో జ్యోతులతో తరలివస్తున్న మహిళలు

పెనుకొండ: మహర్షి వాల్మీకి ప్రజలకు ఆదర్శ ప్రాయుడని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ పట్టణంలో గురువారం మంత్రి బోయగేరిలో మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు అశ్వర్థనారాయణ, జంపు శ్రీనివాసులు, వాల్మీకి పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలును పట్టణంలోని బోయగేరి, వాల్మీకి విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ బోయ నరసింహులు ,మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని రాగిమేకులపల్లిలో గురువారం వాల్మీకి విగ్రహం వద్ద వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. సాయత్రం వాల్మీకి చిత్ర పటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

గోరంట్ల: మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం వాల్మీకి సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకులు స్థానిక బస్టాండ్ సర్కిల్‌లోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈసందర్భంగా సీఐ శేఖర్‌ను వాల్మీకి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో మండలంలోని వాల్మీకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అగళి: మండల కేంద్రంలోని బోయ వాల్మీకి కులస్తులు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి విగ్రహానికి అభిషేకం చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాల్మీకి జయంతి జరుపుకున్నారు. ఓబన్న నాయక అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంతరాష్ట్ర కోఆర్డినేటర్ మంజునాథ్, మాజీ సర్పంచ్ శివలింగప్ప, గంట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా గురువారం నిర్వహించారు. స్థానిక కోట వీధిలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో మహర్షి వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో వాల్మీకులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రంలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు జరిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ వేణు, వాల్మీకి సంఘం నాయకులు చంద్ర, నరసింహమూర్తి, ఆంజనేయులు, మల్లికార్జున, వెంకటేశు, హనుమంతు, రామాంజనేయులు పాల్గొన్నారు.

హిందూపురం: వాల్మీకి జయంతి వేడుకలు పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు జ్యోతులతో సూరప్పకట్ట నుంచి చిన్నమార్కెట్ బోయపేట మీదుగా వాల్మీకి విగ్రహం వరకు భారీ ఊరేగింపు చేశారు. అనంతరం వాల్మీకిమహర్షి విగ్రహానికి పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలతోపాటు అన్నదానం చేపట్టారు. శ్రీకంఠపురంలో వాల్మీకి జయంతి నిర్వహించారు.

హిందూపురం టౌన్: స్థానిక ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేపట్టారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేపాక్షి: తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కంచిసముద్రంలో వాల్మీకులు వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు.

చిలమత్తూరు: మహాకవి వాల్మీకి మహర్షి జయంతిని మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

పావగడ: మహర్షి వాల్మీకి ఆదర్శాలు నెరవేర్చిన నాడే వాల్మీకి జయంతికి సార్థకత అని ప్రధాన వక్త ప్రిన్సిపాల్ మారెప్ప తెలిపారు. గురువారం స్థానిక తాలూకా కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ వరదరాజు మాట్లాడుతూ వాల్మీకి రామాయణమే శ్రేష్టమైనదని అన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్ మాట్లాడుతూ పట్టణంలో సరైన చోట వాల్మీకి విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు.



గోరంట్లలో వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు



అమరాపురంలో వాల్మీకి విగ్రహానికి పూజలు చేస్తున్న వాల్మీకులు

భారీ వర్షానికి పెన్నా పరవళ్లు



రొద్దం నారనాగేపల్లి వద్ద పారుతున్న పెన్నానది



దాసేగౌడనపల్లిలో వర్షాని కూలిన ఇంటి పైకప్పు



వేరుశనగ వామి కింద చేరిన నీరు



పెనుకొండ మండలం శెట్టిపల్లి క్రాస్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

రొద్దం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి గురువారం మండలంలోని నారనాగేపల్లి వద్ద పెన్నానది పరుగులు పెట్టింది. నూతనంగా నిర్మించిన బ్రిడ్జి కింద నుంచి వర్షపు నీరు ఉధృతంగా కదిలాయి. పెన్నానదిపైన ప్రాంతంలో వర్షం పడడంతో వర్షపు నీరు భారీగా చేరింది. మండలంలో 68.6మి.మీ. వర్షం పడినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పెన్నా నది ఉధృతంగా పారడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

తగ్గిన వరద

పరిగి: మండలంలోని జయమంగళి నదిలో నీటి ప్రవాహ ఉధృతి స్వల్పంగా తగ్గింది. బుధవారం భారీగా ప్రవహించిన నది గురువారం కాస్త నెమ్మదించిది. శ్రీరంగరాజుపల్లి వద్ద ప్రవహిస్తున్న జయమంగళి నది ప్రవాహ ఉధృతి గురువారం కాస్త తగ్గడంతో కాజ్‌వేపై ప్రజల రాకపోకలను ప్రారంభించారు. ప్రధానంగా జయమంగళి నది నుంచి పరిగి చెరువుకు వెళ్లేందుకు నిర్మించిన డైవర్షన్ కెనాల్ ద్వారా వరద ప్రవాహం యథావిధిగా కొనసాగుతోంది. వారం రోజులుగా నీటి ప్రవాహం పరిగి చెరువుకు కొనసాగుతోంది. కాగా పరిగి చెరువుకు పెద్దఎత్తున నీరు చెరడంతో మండల ప్రజల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే మరువ ప్రాంతంలో కొన్ని మరమ్మతుల కారణంగా నష్టపోయో పరిస్థితి ఉండటంతో గురువారం పలు గ్రామాల రైతులు స్వచ్ఛందంగా వచ్చి మరమ్మతులలో భాగస్వాములయ్యారు.

దంచికొట్టిన వాన

పెనుకొండ రూరల్: గత రెండు రోజులగా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు వాగులు,వంకలు పోర్లాయి. మండల వ్యాప్తంగా గురువారం 90.2 సె.మీగా వర్షపాతం నమోదైన ట్లు, రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా రైల్వే అండర్ బ్రిడ్జిలోకి వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మండలంలోని శెట్టిపల్లి క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన. రైల్వే అండర్ బ్రిడ్జిలోకి గురువారం కురిసిన వర్షానికి వర్షపు నీరు చేరింది. శెట్టిపల్లి,బోజ్జారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. చేసేదేమి లేక యర్రబల్లి మీదగా 12 కిలో మీటర్లు చుట్టి గ్రామానికి చేరుకున్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు

అగళి: మండల పరిధిలోని దాసేగౌడనపల్లి గ్రామంలో నాగమ్మ.పి, బ్యాడగేర గ్రామంలో కరియన్న, అగళి ఎస్సీ కాలనీలో రామక్కకు చెందిన ఇళ్లు భారీ వర్షానికి గురువారం కూలిపోయాయి.

భారీ వర్షాలతో తీవ్ర నష్టం

గుడిబండ: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేరుశనగ, పత్తి, కంది పంటలను రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపు నీరు

అగళి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోకి వర్షపునీరు చేరింది. పైకప్పు దెబ్బతినడంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కార్యాలయంలో కంప్యూటర్లు, ఫైళ్లు, రికార్డులు తడిసిపోయాయి.

వర్షం రాకతో ఉల్లి పంటకు నష్టం

అమరాపురం: మండలంలో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఉల్లి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్ట పోయారు. ఉల్లి పంట చేతికొచ్చి పంట తొలగించే సమయంలో అకస్మాత్తుగా వర్షం రావడంతో ఉల్లి పంట దెబ్బతిన్నట్లు రైతులు హనుమక్క, శివకుమార్, యంజేరప్ప తదితరులు తెలిపారు. ఎకరా పొలంలో ఉల్లి సాగు చేయడానికి రూ.80 వేలు ఖర్చు వచ్చిందని, అయితే పంట చేతికొచ్చే సమయంలో వర్షం రాకతో మొత్తం పంట దెబ్బతిన్నట్లు వారు వాపోయారు.

భారీ వర్షానికి కూలిన కల్వర్టు

గుడిబండ: ఫళారం గ్రామం వద్ద ఉన్న ఈరగెంచమ్మ వంకపై నిర్మించిన కల్వర్టు ఎడతెరిపి లేకుండా వర్షానికి గురువారం కూలిపోయింది.

మడకశిరరూరల్: అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కోతకు వచ్చిన మిరప పంటలో వర్షపు నీరు నిల్వ ఉండడంతో పండు కాయలను తొలగించుకోవడానికి వీలు లేకపోయిందని రైతు లక్ష్మమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన వేరుశనగ పంట పొంలోనే తడిసి మొలకెత్తుతున్నాయని రైతులు అంటున్నారు. అప్పు చేసి ఐదు ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట వర్షానికి కుళ్లిపోతోందని రైతు రవికుమార్ తెలిపారు. ఆర్.అనంతపురం క్రాస్ నుంచి తురుకువాండ్లపల్లి, జమ్మానిపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు గుంతలు పడి వర్షం నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని తెలిపారు.

193.2 ఎంఎం వర్షపాతం నమోదు

మడకశిర: నియోజకవర్గంలో తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురిశాయి. 5 మండలాల పరిధిలో కూడా వర్షాలు పడ్డాయి. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో మొత్తం 193.2 ఎంఎం వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మడకశిర మండలంలో 38.4, అమరాపురం మండలంలో 50.2, గుడిబండ మండలంలో 41.4, రొళ్ల మండలంలో 36.6, అగళి మండలంలో 26.6 ఎంఎం చొప్పున వర్షం పడినట్లు వారు తెలిపారు.

కార్యదర్శుల బాధ్యతల స్వీకరణ

పరిగి: మండలంలోని మేజర్ పంచాయతీలు పరిగి, కొడిగెనహళ్లి పంచాయతీ కార్యదర్శులుగా నారాయణ, అరుణ గురువారం బాధ్యతలను స్వీకరించారు. పరిగి పంచాయతీ కార్యదర్శి అరుణ కొడిగెనహళ్లి ఇన్‌చార్జ్, కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీలో సెక్రటరీగా విధులు నిర్వర్తించిన నారాయణ పరిగికి బదిలీ అయ్యారు. గురువారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సర్పంచ్‌లు లక్ష్మీదేవి, సాకమ్మ వారిని అభినందించారు.